
# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :134 EDITOR:CHERUKU UPENDAR, DATE : SUNDAY 24 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 134 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 24 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## సీఐడీ కస్టడికి చంద్రబాబు



రాజమండ్రి- ప్రభాత సూర్యుడు

రాజమండ్రి సెంట్రల్ జైల్లో టీడీపీ అధినేత చంద్రబాబును సీఐడీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. ఉదయమే చంద్రబాబుకు ప్రత్యేక వైద్య బృందం మెడికల్ టెస్టులు చేసింది. అల్పాహారాన్ని తీసుకున్న చంద్రబాబు మెడిసిన్స్ వేసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు సరిగ్గా ఉదయం 9.30 గంటలకు

మిగతా 2లో...

### అక్టోబరు 2న

## రాష్ట్రానికి మోడీ



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

లంగాణ అసెంబ్లీ ఎన్నికల కార్యాచరణ కసరత్తును బీజేపీ రాష్ట్ర నాయకత్వం కొలిక్కి తెచ్చింది. ఈ ఎన్నికల్లోనూ జాతీయ నాయకత్వాన్ని వీలైనంత మేరకు భాగం చేసేలా ప్రణాళికలు రచిస్తోంది. బహుముఖ వ్యూహంతో ఎన్నికల కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని కిషన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. సభలు, సమావేశాలు, ఇతర ఎన్నికల కార్యక్రమాలు ఎలా

మిగతా 2లో...

### "ఎవని పాలయ్యిందిరో తెలంగాణ..ఎవడేలుతున్నాడురో తెలంగాణ"

## ఆ గళానికి ఏమైంది..!



### సాయిచంద్ మరణమే ఏపూరి సోమన్నకు కలిసొచ్చిందా.....

తెలంగాణ బ్యూరో - ప్రభాత సూర్యుడు

కెసిఆర్ పాలనకు, బిఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గజ్జె కట్టి తన ఆట పాటలతో ప్రజల మత్తు వదిలించిన ఏపూరి సోమన్న మత్తులోకి వెళ్ళాడా ? లేదా లొంగిపోయాడా ? అన్న సందేహాలు మొదలయ్యాయి. 'ఎవని పాలయ్యిందిరో తెలంగాణ.., ఎవడేలుతున్నడురో తెలంగాణ' అని గలమెత్తినా, 'బిఆర్ఎస్ ఏందిరో.., టిఆర్ఎస్ ఎటు పాయరో ' అని చిందేసి తెలంగాణ ప్రజా వ్యతిరేకతను చాటిన బహుజన గొంతుక ఏపూరి సోమన్న బిఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్టు ప్రకటించి, మంత్రి కేటీఆర్ ను కలవడంతో బహుజన వర్గాల, కళాకారుల ఆగ్రహానికి సోమన్న గురికాక తప్పడం లేదు. ప్రజా యుద్ధ నౌక గద్దర్ మరణానంతరం, ఆ స్థాయి స్థానాన్ని, మెప్పును పొందిన ఏపూరి ఒక్కసారిగా బిఆర్ఎస్ పార్టీలోకి చెరబోతున్నారన్న నిర్ణయం వెనుక అసలు మర్మం ఏమిటనే అంశం ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. బిఆర్ఎస్ వాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ప్రధాన భూమిక పోషించిన సాయిచంద్ మరణాన్ని సోమన్న కోరుకున్నాడా ? లేక ఆయన మరణమే సోమన్నకు కలిసి వచ్చిందా? అనే ప్రశ్నలు కొత్తగా తెరపైకి వచ్చాయి. ఇదిలా ఉంటే ఏపూరి సోమన్న కేటీఆర్ ను కలవడంతో బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు పూర్తిస్థాయిలో

మిగతా 2లో...

### హనుమంత వాహనంపై

## కోదండ రామునిగా శేషాచలాధీశుడు



తిరుమల - ప్రభాత సూర్యుడు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు శేషాచలాధీశుడు శ్రీ కోదండ రాముని అవతారంలో ధనుస్సు, బాణం ధరించి తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. వాహనం ముందు భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా.. మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు

మిగతా 2లో...

## అభివృద్ధికి ఊతం

- నిర్మల్ మున్సిపాలిటీకి రూ. 50 కోట్ల నిధులు మంజూరు
- సీయం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం
- కృతజ్ఞతలు తెలిపిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నిర్మల్ - ప్రభాత సూర్యుడు

నిర్మల్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 50 కోట్ల టి.యు.ఎఫ్.ఐ.డి.సి నిధులను కేటాయించిందని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. నిర్మల్ పట్టణాభివృద్ధికి రూ. 50 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ కు ప్రజల తరపున కృతజ్ఞతలు చెప్పారు. నిర్మల్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి.. సీయం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అడిగిన వెంటనే నిర్మల్ పట్టణ అభివృద్ధికి రూ. 50 కోట్ల నిధులను కేటాయించారు. నిర్మల్ పట్టణాభివృద్ధికి నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. ప్రత్యేక నిధులు మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంతో ఊతమిస్తాయి. సమగ్ర ప్రణాళికతో నిధులను సద్వినియోగం చేసుకుంటాం. ఈ నిధులతో ప్రజలకు కనీస మౌలిక వసతులను కల్పించడంతో పాటు పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం. ప్రతి వార్డుకు సీసీ రోడ్డు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్లు, పార్కులు, ఏర్పాటు చేస్తాం. సీఎం కేసీఆర్ రాజీపడకుండా విడుదల చేసిన నిధులతో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తామని వివరించారు. ఈ నిధులతో రూ. 9.80 కోట్లతో 42 వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, రూ. 5 కోట్లతో నూతన పురపాలక భవన నిర్మాణం, రూ. 4 కోట్లతో ఎన్టీఆర్ స్టేడియంలో ఇండోర్ స్టేడియం ఒ మల్టిపర్పస్ హాల్, రూ. 2 కోట్లతో

మిగతా 2లో...

### 26న జలవిహార్‌లో

## బీసీ సంఘం సమావేశానికి మద్దతు

- బీసీ సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య కీలక భేటీ



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

చట్టసభల్లో బీసీ మహిళలకు, బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంతోపాటు కులగణన చేపట్టాలన్న డిమాండ్ తో ఈనెల 26వ తేదీన జలవిహార్ లో బీసీ సంఘాలు ఏర్పాటు చేసిన సమావేశానికి పూర్తిగా మద్దతు ఇస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. శనివారం రోజున వైఎస్ఆర్ సీపీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు

మిగతా 3లో...

## ఢిల్లీకి షర్మిల



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ పార్టీలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ విలీనంపై షర్మిల ఏదో ఒకటి తేల్చుకోవాలనుకుంటున్నారు. ఓ వైపు కాంగ్రెస్ టిక్కెట్ల కసరత్తు పూర్తవుతోంది. కమ్యూనిస్టులతో పొత్తులపైనా చర్చిస్తున్నారు. కానీ షర్మిల పార్టీ గురించి మత్రం ఎలాంటి స్పందన వ్యక్తం చేయడం లేదు. దీంతో షర్మిల ఏదో ఓ విషయం తేల్చుకోవాలని ఢిల్లీ వెళు న్నట్లు?గ తెలుస్తోంది. ఇటీవల సీడబ్ల్యూసీ సమావేశాల సందర్భంగా హైదరాబాద్‌లో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో షర్మిల భేటీ అయ్యారు. వైఎస్సార్‌టీపీ విలీనంకు సంబంధించి ఆయన మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. ఆయన కూడా ఏమీ

మిగతా 2లో...

## నేడు జాతీయ సేవా పథకం దినోత్సవం


### విద్యార్థుల్లో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

విద్యార్థి దశ నుంచే సేవా భావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కల్పించేందుకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తమ కళాశాలలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలోను, ప్రజలను సమాజ సేవ పట్ల చైతన్యపర్చడంలోను ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కృషి వెల కట్టలేనిది. సమాజంలో ఉన్నవారిని చైతన్యపర్చడంతో పాటు, సమాజ సేవను తమ సేవగా భావించే భావజాలం విద్యార్థి దశ నుంచే అలవాటు చేయడం ద్వారా దేశ భవిష్యత్తుకు పునాదులు వేసినట్లవుతుంది. ప్రతిఫలం ఆశించకుండా సేవా మార్గం పట్టేవారే ఎన్ఎస్ఎస్‌లో వలంటీర్లుగా చేరతారు. జాతీయ సేవా పథకం (నేషనల్ సర్వీస్ స్కీమ్ ) భారత ప్రభుత్వం చేత 1969 సంవత్సరం ప్రారంభించబడిన యువజన కార్యక్రమం. ఈ పథకాన్ని ప్రారంభించి నేటికీ 55 సంవత్సరాలు. (సెప్టెంబర్ 24 2023), ఇక దీని చరిత్రలోకి పోతే డా. డి.ఎస్. కొఠారి (1964–66) నేతృత్వంలోని విద్యా కమిషన్, విద్య అన్ని దశలలో ఉన్న విద్యార్థులను ఏదో ఒక విధమైన సామాజిక సేవతో ముడిపెట్టాలని సిఫారసు చేసింది. ఏప్రిల్ 1967 సంవత్సరంలో రాష్ట్రాల విద్యాశాఖ మంత్రి వారి సమావేశంలో దీనిని పరిగణనలోకి తీసుకున్నారు. అయితే అప్పటికే విశ్వవిద్యాలయ దశలో, స్వచ్ఛంద ప్రాతిపదికన ఉనికిలో ఉన్న నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్ సి సి) లో చేరడానికి విద్యార్థులను అనుమతించాలని, దీనికి ప్రత్యామ్నాయాన్ని నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) అని పిలువబడే కొత్త కార్యక్రమం రూపంలో వారికి అందించవచ్చని వారు సిఫార్సు చేశారు. 1969

మిగతా 2లో...

## ఫస్ట్ లిస్ట్‌లో 60 మంది



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఢిల్లీలో కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశం పూర్తి అయింది. రెండు రోజుల పాటు కాగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశం సాగిస్తుండగా.. ఈరోజే దాదాపు ఐదు గంటల పాటు కొనసాగింది. తెలంగాణ కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థుల జాబితా దాదాపుగా పూర్తి అయినట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపికలో సర్వే రిపోర్టు, సామాజిక వర్గం, బలమైన అభ్యర్థి అంశాలపై స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో చర్చించింది. ఏకాభిప్రాయంతో 60 శాతానికి పైగా అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. అయితే కాంగ్రెస్ వార్ రూములో స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్ మురళీధరన్

మిగతా 3లో...

### అక్టోబరు 2న

# రాష్ట్రానికి మోడీ

(మొదటిపేజీ తరువాయి)
చేపట్టాలి, ఎప్పుడు చేపట్టాలని అనే కార్యాచరణపై ఈ నెల ఆఖరు లోపు తుది నిర్ణయానికి వచ్చి.. వచ్చే నెల నుంచి దానిని అమలు చేయడానికి సిద్ధమైంది. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు రానున్నారు. అదే రోజు నిజామాబాద్, మహబూబ్‌నగర్ లలో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొంటారని రాష్ట్ర నాయకత్వం వెల్లడించింది.మోదీ పర్యటన తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆ తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలు రాష్ట్రానికి రానున్నారు. వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేయబోయే బహిరంగ సభల్లో పాల్గొంటారు. ఈ మేరకు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి.. రాష్ట్ర నేతలతో సమావేశమై ఎన్నికల కార్యాచరణను ఖరారు చేస్తారని పార్టీ నేతలు తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 119 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 3 మార్గాల్లో బస్సు యాత్ర చేపట్టాలని రాష్ట్ర నాయకత్వం మొదటి ప్రణాళిక వేసుకుంది. ప్రస్తుతానికి బస్సు యాత్రలను వాయిదా వేసింది. బస్సు యాత్రల స్థానంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు, నాలుగు సభలను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే సభలను రాజకీయ సభలుగానే పరిగణించి.. వాటిని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది.అసెంబ్లీ నియోజకవర్గాల్లో సభల తేదీలను.. ఒకటీ రెండు రోజుల్లో ఖరారు చేసే అవకాశాలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సభలను ప్రారంభించి.. ముఖ్యనేతలు, కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ నాయకులు పాల్గొనేలా షెడ్యూల్ రూపొందించాలని భావిస్తున్నారు. బీఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది.. కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన ఒకటీ రెండు రోజుల్లో ఉండనున్నట్లు తెలుస్తోంది.. ఈ నేపథ్యంలో బీజేపీ అభ్యర్థుల జాబితాను కూడా వీలైనంత త్వరగా అక్టోబర్ మొదటి వారంలో వెల్లడించడానికి సిద్ధమవుతున్నారు రాష్ట్ర నేతలు. నియోజకవర్గానికి ముగ్గురు లేదా నలుగురి పేర్లను గుర్తించి.. సర్వేలు, పార్టీ నేతల అభిప్రాయాలు, వివిధ సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీ ముఖ్యనేతలంతా.. అసెంబ్లీ బరిలో నిలవాల్సి ఉంటుందని ఇప్పటికే జాతీయ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సహా ఇతర కీలక నేతలు అందరూ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం దాదాపు ఖాయం అయిపోయినట్లు తెలుస్తోంది. బూత్ కమిటీలు, మండల కమిటీలతో సమావేశం అవుతూ ఎన్నికల సంసిద్ధతపై.. నియోజకవర్గాల వారీ నాయకులు పరిశీలన చేస్తున్నారు. ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరకించే విషయంపై దృష్టి పెట్టారు. నియోజకవర్గ ఇంఛార్జీలు తమ రాష్ట్ర కమిటీకి సెగ్మెంట్ల వారీగా నివేదికలను అందజేయనున్నారు.

## హనుమంత వాహనంపై కోదండ రామునిగా శేషాచలాధీశుడు

(మొదటిపేజీ తరువాయి)
సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. 'హనుమంత వాహనం – భగవత్ భక్తి ప్రాప్తి హనుమంతుడు భగవత్ భక్తులలో అగ్రగణ్యుడు. రామాయణంలో మారుతి స్థానం అద్వితీయం. చతుర్వేద నిష్ణాతుడుగా, లంకాభీకరుడిగా ప్రసిద్ధుడైన ఆంజనేయుడు వేంకటాద్రివాసుని మూపున వహించి దర్శనమిచ్చారు. గురు శిష్యులైన శ్రీరామ హనుమంతులు తత్త్వ వివేచన గావించిన మహనీయులు కనుక వాహ్య వాహకరూపంలో ఈ ఇరువురిని చూసిన వారికి పుణ్య ఫలం లభిస్తుంది. సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు స్వర్ణరథంపై శ్రీమలయప్పస్వామివారు భక్తులను కటాక్షిస్తారు. రాత్రి 7 గంటలకు గజవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. వాహనసేవలలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి. తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఈవో ఎవి.ధర్మారెడ్డి దంపతులు, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జేఈవో లు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి షర్మిల

(మొదటిపేజీ తరువాయి)
చెప్పకపోతూండటంతో షర్మిలకు ఏ నిర్ణయం తీసుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ కాంగ్రెస్ నేతలు షర్మిలను చేర్చుకోవద్దన్న గట్టి పట్టుదలతో ఉన్నారు. కోమటిరెడ్డి వంటి ఒకరిద్దరు ఓకే చేసినా..ఇతరులు మాత్రం వద్దంటున్నారు. షర్మిల ను పార్టీలో చేర్చుకోవడం వల్ల కాంగ్రెస్‌కు తీవ్ర నష్టం ఉంటందని భావిస్తున్నారు. అందుకే..షర్మిల ఏపీలో పని చేయాలని కాంగ్రెస్ హైకమాండ్ సూచిస్తున్నట్లుగా చెబుతున్నారు. ఇప్పటికే పార్టీ విలీనంపై షర్మిల నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే ప్రకటన చేస్తానంటూ ఇటీవల వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలో తెలిపారు. కానీ తెలంగాణలో రాజకీయాలు చేయాలా? లేదా ఏపీలో షర్మిల సేవలను ఉపయోగించుకోవాలా? అనే దానిపై తర్జనభర్జన జరుగుతోంది. ఏపీకి వెళ్లాలని షర్మిలను కాంగ్రెస్ కోరుతుండగా.. ఆమె అక్కడికి వెళ్లేందుకు తిరస్కరిస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లోనే ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు. కానీ కాంగ్రెస్ మాత్రం తెలంగాణకు భారం అని భావిస్తోంది. షర్మల పార్టీ కాంగ్రెస్ లో విలీనం కారణంగా ఆ పార్టీలో ఉన్న ఒకరిద్దరు నేతలు కూడా వెళ్లిపోతున్నారు. షర్మిల పాదయాత్రలో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి తన పార్టీ తరపున ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న పోటీ చేస్తారని ప్రకటించారు. ఆయనను తన సోదరుడిగా చెప్పారు.కానీ ఇప్పుడు ఆ ఏపూరి సోమన్న షర్మిల పార్టీకి గుడ్ బై చెప్పాలని నిర్ణయించుకున్నారు. బీఆర్ఎస్‌లో చేరిపోవాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే ఇందిరా శోభన్ రాజీనామా చేశారు. ఇక ఆ పార్టీలో ముఖ్య నేతలంటూ ఎవరూ లేకుండా పోయారు. షర్మిల ఒంటరిగా నిలిచారు. పార్టీ కార్యక్రమాలను కూడా ఆమెపెద్దగా చేపట్టడం లేదు. షర్మిల వచ్చే ఎన్నికల్లో పాలేరు నుంచి పోటీ చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరగా.. ఆయన అక్కడ నుంచి టికెట్ ఖరారు చేశారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నయి. దీంతో షర్మిల పోటీ చేసే విషయంపై క్లారిటీ రాకపోవడంతో కాంగ్రెస్‌లో వైఎస్సార్‌టీపీ విలీనానికి బ్రేక్‌లు పడ్డాయి. ఢిల్లీ పర్యటనలో పార్టీ విలీనంపై తుది చర్చలు జరుగుతాయని, అనంతరం షర్మిల క్లారిటీ ఇచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఒక వేళ కాంగ్రెస్ హ్యాండిస్తే షర్మిల ఏం చేస్తారన్నదానిపై ఆసక్తి ఏర్పడింది.

### ఎవని పాలయ్యిందిరో తెలంగాణ..ఎవడేలుతున్నాడురో తెలంగాణ

# ఆ గళానికి ఏమైంది!

(మొదటిపేజీ తరువాయి)అర్థమయింది.

సాయి చంద్ అకాల మరణంతో వచ్చే ఎన్నికల్లో ప్రజలను ఉర్రూతలను ఊగించే పాటకారి, మాటకారి బిఆర్ఎస్ పార్టీకి అనివార్యమైంది. సాయిచంద్ లోటును ఏపూరి సోమన్న పసిగట్టి గద్దర్ ఆశయాలను తుంగలోకి నెట్టి ఏపూరి సోమన్న బిఆర్ఎస్ పార్టీతో చేతులు కలపడంతో తెలంగాణ సమాజ, కళాకారులు సిగ్గుతో తల దించుకునేలా చేశాడని రాజకీయ విశ్లేషకుల భావన. తెలంగాణ ఏర్పాటున తొలినాళ్ల నుండే కేసీఆర్ పాలనను తీవ్రంగా వ్యతిరేకించిన సోమన్న ప్రజా వేదికలపై బలంగా తన వాదాన్ని బలంగా వినిపించి, ప్రజలను చైతన్య పరిచాడు. తెలంగాణ అంటేనే ఆ నలుగురు అన్నరీతిలో, మెజారిటీ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి రాబోవు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అనుకుంటున్న ఈ తరుణంలో ఏపూరి సోమన్న బిఆర్ఎస్ పార్టీలో చేరుతుండడాన్ని తెలంగాణ ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. ఏపూరి సోమన్న తీసుకున్న ఈ నిర్ణయంలో కచ్చితంగా ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బిజెపి పార్టీల అసమర్ధత, చేతకానితనం కనబడుతుంది.

ఏపూరి సోమన్నకు బిఆర్ఎస్ పార్టీ ఆఫర్లను ప్రతిపక్షాలు నిర్వరించ లేకపోవడం, ఏపూరి సోమన్న పాట, మాటలను, గుర్తించక పసిగట్టకపోవడం కూడా ప్రతిపక్షాల అసమర్ధతే అయితే, సోమన్నను ఆకర్షించడంలో అధికార బీఆర్ఎస్ మాత్రం సఫలీకృతమైందని చెప్పుకోవచ్చు. "బిఆర్ఎస్ ఏందిరో.., టిఆర్ఎస్ ఎటు పాయరో" అని చిందేసిన ఏపూరి బిఆర్ఎస్ పార్టీ దొరల కాడికి చేరుతున్నాడు అంటేనే దీని వెనక చాలా బలమైన కారణం ఉండకపోలేదు ! ఏపూరి సోమన్న నిర్ణయం వల్ల పాటకారి, మాటకారి,నృత్యకారి అయిన ఏపూరి సోమన్నకు ఎస్సీ,ఎస్టి,బిసి,మైనారిటీ,అగ్రకుల పేదల నుండి విమర్శ ఎప్పటికీ తప్పదు.

ప్రతి వేదికపై తెలంగాణ కోసం అమరులైన మారోజు వీరన్న, బెల్లి లలిత, శ్రీకాంతాచారి ,గద్దర్ లాంటి ఎందరో అమరులను స్మరిస్తూ ఆడి పాడి వారి త్యాగాలను గుర్తు చేస్తూ ఏపూరి సోమన్న పాడిన ఆ ప్రజా వేదికలే ఏపూరి సోమన్నకు సమాధానం చెప్తాయి. ఇటువంటి నిర్ణయం వల్ల ప్రజా కళాకారులపై ఏపూరి సోమన్న ఎప్పటికీ చెరిగిపోని మచ్చగా మిగిలిపోక తప్పదు.

# సీఐడీ కస్టడికి చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)
ఆయనను సీఐడీ అధికారులు కస్టడీలోకి తీసుకుని, విచారణను ప్రారంభించారు. సాయంత్రం 5 గంటల వరకు విచారణ కొనసాగింది. స్కిల్ డవలప్‌మెంట్ కేసు.. చంద్రబాబు నాయుడు విచారణ 2రోజులు.. 15గంటలు.. 120 ప్రశ్నలు.. మొత్తం ఆధారాలతో సీఐడీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. డాక్యుమెంట్స్ ముందుపెట్టి బాబుపై మోపిన మొత్తం 34 అభియోగాలపై ప్రశ్నలు సంధిస్తున్నారు సీఐడీ అధికారులు.. బాబు తరఫున ఇద్దరు లాయర్ల సమక్షంలోనే.. లోకేష్, కిలారి రాజేష్, పీఏ శ్రీనివాస్ పాత్రపై ఆరా తీస్తోంది. మధ్య మధ్యలో 5 నిమిషాలు విరామం తర్వాత..మళ్లీ ప్రశ్నిస్తోంది. ఉదయం పదిగంటలకు మొదలైన విచారణ లంచ్ బ్రేక్ వరకూ కొనసాగింది. మొదటి సెషన్‌లో 3 గంటలకు పైగా సీఐడీ అధికారులు విచారణ చేశారు. ప్రతి గంటలకు ఇద్దరు చొప్పున సీఐడీ అధికారులు చంద్రబాబును ప్రశ్నించారు.ఉదయం 9.30 గంటలకు రాజమండ్రి సెంట్రల్ జైలుకు చేరుకున్నారు సీఐడీ అధికారులు బృందం. 9 మంది అధికారుల బృందం స్కిల్ స్కాంలో ఉదయం 10 గంటలకు విచారణ మొదలు పెట్టింది. జైలులోని చంద్రబాబు బ్యారక్ ప్రాంతంలోనే ప్రత్యేక గదిలో విచారణ కొనసాగింది. విచారణలో ఇద్దరు మధ్యవర్తులు, ఒక ఫొటో గ్రాఫర్ ఉన్నారు. ధనుంజయ నేతృత్వంలో ఒక్కో టీమ్‌లో ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు ఉన్నారు. చంద్రబాబు సమాధానాలను రికార్డు చేసేందుకు ల్యాప్‌టాప్, ప్రింటర్లు, వీడియో చిత్రీకరణ చేశారు. విచారణకు ముందు చంద్రబాబుకు వైద్య పరీక్షలు నిర్వహించారు.మొదటి గంటలో చంద్రబాబును వివిధ అంశాలపై ప్రశ్నలు అడిగారు సీఐడీ అధికారులు. ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు సేకరించిన ఆధారాలకు అనుగుణంగా ప్రశ్నలు సంధించారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ ఎందుకు అమెరికా పారిపోయాడు? పెండ్యాల శ్రీనివాస్‌కు అమెరికా వెళ్లేందుకు విమాన టికెట్లు ఎవరు తీసుకున్నారు? సీమెన్స్ మాజీ ఎండి సుమన్ బోస్‌తో ఏ ఏ లావాదేవీలు నిర్వహించారు? చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌కు ఇన్‌కమ్‌టాక్స్ శాఖ ఇచ్చిన నోటీసులపై ఏమంటారు? డిజైన్టెక్ కంపెనీ అధిపతి ఖన్వేల్కర్‌తో ఉన్న అనుబంధమేంటీ?షెల్ కంపెనీల ఏర్పాటు వెనక ఎవరెవరు ఉన్నారు? స్కిల్ డెవలప్‌మెంట్ నిధుల విడుదలకు ఎందుకు తొందరపడ్డారు? అధికారులపై ఎందుకు ఒత్తిడి తెచ్చారు? కీలకమైన ఫైళ్లు ఎలా మాయమయ్యాయి? మొదటి సెషన్‌లో సీఐడీ అడిగిన ప్రశ్నలు ఇవేనా!

సీమెన్స్ కు తెలియకుండానే వారి పేరుతో దోపిడీకి స్కెచ్ గీశారా ?

కేబినెట్ అనుమతి లేకుండానే స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కి ప్లాన్ చేశారా ?

స్కిల్ డెవలప్ మెంట్ లో సీమెన్స్ 90%, రాష్ట్ర ప్రభుత్వం 10% అని జీవో ఇచ్చారా? లేదా ?

సీమెన్స్ కంపెనీతో కాకుండా.. సుమన్ బోస్ అనే వ్యక్తితో ఓూజ చేసుకున్నారా? లేదా ?

330 కోట్ల ప్రాజెక్టును.. దోచుకోవడం కోసమే ప్రాజెక్టు వ్యయాన్ని రూ.3356 కోట్లని చూపించారా? లేదా ?

అధికారులు అభ్యంతరం చెప్పినా డబ్బు రిలీజ్ చేయాలని ఆదేశించారా? లేదా ?

సీమెన్స్ తో ఒప్పందం అని చెప్పి.. డైరెక్ట్ గా డిజైన్ టెక్ కు 371 కోట్లు రిలీజ్ చేశారా? లేదా?

నిధుల విడుదల నుంచి షెల్ కంపెనీలకు డైవర్ట్ చేసేంత వరకు మీ కనుసన్నల్లోనే జరిగిందా? లేదా ?

డిజైన్ టెక్ నుంచి రూ. 240 కోట్ల ప్రజాధనాన్ని షెల్ కంపెనీలకు మళ్ళించారా? లేదా ?

గంటా సుబ్బారావుకు, లక్ష్మీనారాయణకు చెందిన కంపెనీలకు ఆ నిధులు వెళ్ళాయా? లేదా ?

సుమన్ బోస్, ఖన్వేల్కర్ ను జీఎస్టీ, ఈడీ పట్టుకోవడంతో నోట్ ఫైల్స్ మాయం చేయించారా? లేదా ? సంబంధం లేదు అంటున్న మీరే.. 13 చోట్ల సంతకాలు పెట్టారా? లేదా ?

మొదటి సెషన్‌లో 3 గంటలపాటు చంద్రబాబును విచారించారు సీఐడీ అధికారులు. రాజమండ్రి సెంట్రల్ జైలు కాన్ఫరెన్స్ హాల్లో సీఐడీ డీఎస్పీ ధనుంజయుడు ఆధ్వర్యంలో అధికారులు ప్రశ్నలు వేశారు. అయితే కోర్టు ఆదేశాల ప్రకారం విచారణ అంశాలు బయటికి రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

# 26న జలవిహార్‌లో బీసీ సంఘం సమావేశానికి మద్దతు

(మొదటిపేజీ తరువాయి)
ఆర్ కృష్ణయ్య ఎమ్మెల్సీ కవితతో సమావేశమయ్యి బీసీల అంశాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... బీసీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. బీసీలు ఆర్థికంగా బలపడాలన్న ఆలోచనతో బీసీ బంధు పథకాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. కుల వృత్తులకు ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా రాయితీలు ప్రోత్సాహకాలను అందిస్తూ వారికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలబడుతుందని పేర్కొన్నారు. బీసీ వర్గాల్లో అత్యంత వెనుకబడిన కులాల వారినీ ప్రభుత్వం విస్మరించడం లేదని చెప్పారు. నామినేటెడ్ పోస్టుల్లో ,పార్టీ పదవుల్లో అత్యంత వెనుకబడిన కులాల వారికి కేసీఆర్ అవకాశాలు కల్పించి చరిత్ర సృష్టించారని స్పష్టం చేశారు.తెలంగాణ ఏర్పడ్డ తర్వాత జరిగిన మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న బిల్లుపై తీర్మానం చేశామని గుర్తు చేశారు. నామినేటెడ్ పదవుల్లో, పార్టీ పదవుల్లో , మార్కెట్ కమిటీ పదవుల్లో బీఆర్ఎస్ పార్టీ చిత్తశుద్ధితో బీసీలకు అనేక అవకాశాలు కల్పించిందని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడక ముందు నుంచే బీసీల డిమాండ్లపై టిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తోందని తెలిపారు. ఆర్ కృష్ణయ్య, వకులాభరణం కృష్ణమోహన్ లను 2004లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ దగ్గరికి సీఎం కేసీఆర్ తీసుకుని వెళ్లి కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడం, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంతోపాటు ఆయా అంశాలపై వినతి పత్రాన్ని అందించారని చెప్పారు. కులగణన చేపట్టాలని సీఎం కేసీఆర్ డిమాండ్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు.బీసీల పట్ల తమ పార్టీ చిత్తశుద్ధితో ఉన్నదని, బీసీలకు రావాల్సిన వాటా, హక్కుల కోసం జరుగుతున్న ఉద్యమానికి తమ పార్టీ అండగా ఉంటుందని ప్రకటించారు. జీవితాంతం బీసీల కోసం పోరాటం చేస్తున్న ఆర్ కృష్ణయ్యను కల్వకుంట్ల కవిత అభినందించారు.

# నేడు జాతీయ సేవా పథకం దినోత్సవం

(మొదటిపేజీ తరువాయి)
సంవత్సరంలో సెప్టెంబరులో జరిగిన వైస్ చాన్సలర్స్ కాన్ఫరెన్స్ ఈ సిఫారసు ప్రకారంగా,సమస్యను వివరంగా పరిశీలించడానికి వైస్ చాన్సలర్లతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయవచ్చని సూచించారు. భారత ప్రభుత్వ విద్యపై జాతీయ విధానం ప్రకటనలో, పని అనుభవం, జాతీయ సేవ విద్యలో అంతర్భాగంగా ఉండాలని నిర్దేశించబడింది. మే, 1969 సంవత్సరంలో, విద్యా మంత్రిత్వ శాఖ, విశ్వ విద్యాలయ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటు చేసిన విశ్వ విద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల విద్యార్థుల ప్రతినిధుల సమావేశం కూడా ఏకగ్రీవంగా 'జాతీయ సేవ జాతీయ సమైక్యతకు శక్తివంతమైన సాధనం కాగలదని ప్రకటించింది. పట్టణ విద్యార్థులను గ్రామీణ జీవితానికి పరిచయం చేయడానికి, తద్వారా దేశ పురోభివృద్ధికి, అభ్యున్నతికి విద్యార్థి సమాజం చేస్తున్న కృషికి చిహ్నంగా ఉంటుందని జాతీయ సేవా పథకం తీసుకరావడం జరిగింది. 1969 సెప్టెంబరు 24న అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ వి.కె.ఆర్.వి.రావు 37 విశ్వ విద్యాలయాలలో జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఈ పథకం అమలుకు సహాయం,సహకారాన్ని అడిగిగారు.విద్యార్థుల ప్రప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. కానీ భావి భారతాన్ని నిర్ణయించవలసినది యువకులే. ప్రతి దేశ పురోభివృద్ధిలోనూ, ఉద్యమాలలోనూ విద్యార్థులు పాలుపంచుకుంటారు. ఒక్కొక్కసారి ఆవేశం ఎక్కువ కావచ్చు కానీ కల్లాకపటం తేలియని నిర్మల మనస్కులు వీరు. వీరు కూడా సంఘజీవులే, సంఘంలో భాగస్వాములే, కాబట్టి సంఘసేవ (సోషల్ సర్వీస్) వాళ్ళకి బాధ్యత ఉంది. విద్యాభ్యాసానికి ఆటంకాలు లేకుండా సంఘసేవ చేసే అవకాశాలున్నాయి.ఒక మనిషి మరొక మనిషికి సహకరించడం మానవతా లక్షణం. అదేవిధంగా మనం పదిమందిలో ఉన్నప్పుడు మనవల్ల ఆ పదిమందికీ ప్రయోజనం వుండాలి– లేదా మనవల్ల మరొకరికి మేలు కలగాలి. ఆ విధంగా పరస్పర సహకారంగా, పరోపకారంగా, మంచిగా మెలగటమే సంఘసేవ.విద్యార్థుల్లో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే అవకాశాన్ని కల్పించడం ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యం. విద్యార్థుల్లో స్వచ్ఛంద సేవను ప్రోత్సహించేందుకు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం రూపొందించబడింది. ఎన్ఎస్ఎస్ కార్యక్రమం రెండు భాగాలుగా విభజించబడింది: సాధారణ కార్యకలాపాలు మరియు ప్రత్యేక క్యాంపింగ్ కార్యక్రమాలు. సాధారణ కార్యకలాపాలలో వారం వారీ సమావేశాలు, సమాజ సేవ, సామాజిక సేవా ప్రాజెక్ట్‌లు ఉంటాయి. ప్రత్యేక క్యాంపింగ్ కార్యక్రమాలు సాధారణంగా 7 రోజుల పాటు నిర్వహించబడతాయి, ఈ సమయంలో విద్యార్థులు శుభ్రపరచడం, మొక్కల పెంపకం మరియు ఆరోగ్యం, పారిశుద్ధ్య కార్యక్రమాల వంటి సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.కళాశాలను పరిశుభ్రంగా వుంచటం– తోటలు పెంచటం– రోడ్లు వెయ్యటం. పరిసర గ్రామాలను దత్తత తీసుకొని ఆ గ్రామంలో రోడ్లు వేయటం, మురికి వాడలను శుభ్రపరచడం, నిరక్షరాస్యులకి విద్య బోధించడం. ఆరోగ్య సూత్రాలను, వయోజన విద్య ఆవశ్యకతను, జనాభా సమస్య నివారణను ప్రజలకు తెలియ జేయడం.

## సంపాదకీయం

# సుందర కశ్మీరంలో మళ్లీ అలజడి

దట్టంగా అడవులు, కొండలు ఉండే ప్రాంతాలను ఎంచుకుని భద్రతా బలగాలపై దాడికి తెగబడటం ఇటీవలి కాలంలో మిలిటెంట్లు అనుసరిస్తున్న వ్యూహం. గత నెలలో ముగ్గురు ఆర్మీ జవాన్లను హతమార్చిన ప్రాంతం కుల్గామ్ కూడా దట్టమైన అటవీ ప్రాంతమే. కొండలు, కోనలు ఉండే అటవీప్రాంతంపై సమగ్ర అవగాహన ఉంటే తప్ప సైన్యం మిలిటెంట్లను తిప్పికొట్టడం సాధ్యం కాదు. తమకు బాగా పట్టున్న ఇలాంటి ప్రాంతాల్లో వారానికి సరిపడా ఆహారం, మందుగుండు సిద్ధం చేసుకుని ఒక పద్ధతి ప్రకారం మిలిటెంట్లు సైన్యాన్ని తామున్నచోటకు రప్పిస్తున్నారు. కొండలపై మాటుగాసి తమవైపు వస్తున్న బలగాలపై కాల్పులు జరపటం మిలిటెంట్లకు సులభమవుతోంది. ఎత్తయిన ప్రాంతంలో ఉండటం వల్ల భద్రతా బలగాలకు బాసటగా వచ్చే హెలికాప్టర్లపై సునాయాసంగా దాడులు చేయగలుగుతున్నారు. 370వ అధికరణను రద్దుచేసి, జమ్మూ?కశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టి నాలుగేళ్లు కావస్తోంది. అటు తర్వాత కశ్మీర్‌లో పరిస్థితి మెరుగు పడిందని, ఆర్థికంగా కోలుకోవటంతోపాటు భద్రతరీత్యా సురక్షితంగా ఉన్నదని బీజేపీ నేతలు చెబుతూ వచ్చారు. గతంతో పోలిస్తే కశ్మీర్‌కు పర్యాటకుల సంఖ్య పెరిగింది. నగరాలు, పట్టణాల్లో మిలిటెంట్ల ఆటలు సాగటం లేదు. కానీ అంతమాత్రానికే సంతృప్తి పడితే ప్రమాదకర పర్యవసానా లుంటాయని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. మిలిటెంట్ల ఫోన్ సంభాషణలను వినటం, వారి ఆనుపానులు ఎక్కడ వున్నాయో కచ్చితంగా అంచనా వేయటంలాంటి అంశాల్లో సైన్యం విఫలమవుతోంది. మైదాన ప్రాంతాల్లో గతంతో పోలిస్తే పరిస్థితి మెరుగుపడింది. అక్కడ భద్రతా బలగాలకు సమాచార వ్యవస్థ పటిష్టంగా ఉండటంతో మిలిటెంట్ల ఆటలు సాగడం లేదు. ఉగ్రవాద దాడులు పెరగటం వెనక ఎప్పటిలాగే పాకిస్తాన్ హస్తం ఉండటం బాహాటంగా కన బడుతోంది. వాస్తవానికి పాక్ ఆర్థికంగా దివాలా తీసి, ఇప్పట్లో కోలుకునే అవకాశం లేని స్థాయికి చేరుకుంది. రాజకీయంగా సరేసరి. ఇమ్రాన్ ఖాన్‌ను గద్దెదించిన నాటినుంచీ సైన్యంపై సాధారణ ప్రజానీకంలో ప్రతికూలత పెరిగింది. మరోపక్క ఉగ్రవాదులకు నిధులు అందజేయటానికి తోడ్పడే సంస్థలనూ, దేశాలనూ నిరోధించేందుకు అంతర్జాతీయంగా ఏర్పాటైన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ పాకిస్తాన్‌పై నిఘా ఉంచింది. అయినా సరే అది తన వెనకటి గుణాన్ని వదులుకోవటానికి సిద్ధపడటం లేదని కశ్మీర్ తాజా పరిణామాలు చెబుతున్నాయి. ఇప్పుడు జరిగిన దాడులకు బాధ్యు లుగా చెప్పుకున్న ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్) పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబాకు అనుబంధంగా పుట్టుకొచ్చిందని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. యాక్షన్ టాస్క్ ఫోర్స్ సంస్థ ఆంక్షలను అధిగమించటానికి పాకిస్తాన్ ఈ కొత్త ఉగ్ర సంస్థను సృష్టించిందని సులభంగానే గ్రహించవచ్చు. సరిహద్దులకు ఆవలినుంచే టీఆర్‌ఎఫ్‌కు ఆయుధాలు, డ్రగ్స్ అందుతున్న సంగతి కూడా నిర్ధారణ అవుతోంది. ఎన్‌కౌంటర్లను పరిశీలిస్తే బలగాలకు మార్గదర్శకాలిచ్చి వారిని నడిపించాల్సిన ప్రధాన అధికారులే బలవుతున్న సంగతి అర్థమవుతుంది. దాడులకు సీనియర్ అధికారులు నేతృత్వం వహించాలన్నది ఒకరకంగా మంచి నిర్ణయమే. ఇందువల్ల దాడుల్లో చురుగ్గా పాల్గొనేందుకు కింది స్థాయి జవాన్లు సంసిద్ధులవుతారు. అయితే దానికి తగినట్టుగా మిలిటెంట్లు మాటువేసిన ప్రాంతాన్ని నిర్ది ష్టంగా, నిర్దుష్టంగా నిర్ధారించుకోవటానికి అవసరమైన పరికరాలు వారికి అందుబాటులో ఉంచటం అతి ముఖ్యం. తగిన వ్యూహాన్ని రూపొందించటంలో, బలగాల్లో ఆత్మవిశ్వాసం నింపి, వారి నమ్మ కాన్ని గెల్చుకోవటంలో సీనియర్‌ల పాత్ర కీలకమైనది. అటువంటి అధికారులను కోల్పో వటం వల్ల భద్రతా బలగాలకు కలిగే నష్టం అంతా ఇంతా కాదు. ఇవన్నీ శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించినవి. వీటికి సమాంతరంగా కశ్మీర్‌లో మళ్లీ రాజకీయ ప్రక్రియ ప్రారంభించటానికి అవసరమైన చర్యలు తీసుకోవటానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవాలి. రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడ గొట్టాక అంతా మెరుగైందని బీజేపీ నేతలు చెబుతున్నా ఉగ్రవాదుల ఆగడాలు క్రమేపీ పెరుగుతున్న సంగతి కాదనలేనిది. పండిట్లపైనా, వలస వచ్చినవారిపైనా మిలిటెంట్ల దాడులు జరుగుతున్నాయని గతంలో కశ్మీర్ సమస్యపై మధ్యవర్తిత్వం వహించిన బృందంలోని సభ్యురాలు రాధాకుమార్ ఇటీవలే గుర్తుచేశారు. కశ్మీర్‌లో నిరుద్యోగిత దేశ సగటుకన్నా మూడు రెట్లు ఎక్కువున్నదని ఆమె అంటు న్నారు. ఇప్పుడు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం 2015 నుంచి మిలిటెన్సీకి దూరంగా ఉంది. అక్కడ గత ఏడెనిమిదేళ్లుగా చెప్పుకోదగిన ఘటనలు లేవు. అటువంటిచోట ఉగ్రవాదులు భద్రతా బలగాలపై దాడులు చేయగలిగారంటే ఆలోచించాలి. కశ్మీర్‌లో నిరుడు దాదాపు వందమంది యువకులు ఉగ్రవాద సంస్థల్లో చేరారని, వీరిలో చాలామంది టీఆర్‌ఎఫ్‌వైపు మొగ్గారని గణాంకాలు చెబు తున్నాయి. కనుక ఉగ్రవాదాన్ని నిరోధించటానికి అవసరమైన చర్యలు తీసుకుంటూనే రాజకీయ ప్రక్రియ ప్రారంభించటం, యువతలో నిరుద్యోగితను అరికట్టడం వంటి చర్యలు అవసరం.

# కదలిక లేని రోవర్ చివరి ప్రయత్నాల్లో ఇస్రో

బెంగళూరు- ప్రభాత సూర్యుడు

14 రోజులుగా చంద్రుడి ఉపరితలంపై నిద్రాణ స్థితిలో (స్లీప్ మోడ్) చంద్రయాన్ 3లోని ల్యాండర్ విక్రమ్, ప్రగ్యాన్ రోవర్‌లను వేక్ అప్ చేయించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లుగా ఇస్రో అధికారులు ప్రకటించారు. మళ్లీ గ్రౌండ్ స్టేషన్‌తో కమ్యూనికేషన్‌ని ఏర్పాటు చేయాలని సైంటిస్ట్‌లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాల్లో భాగంగా ఇప్పటిదాకా విక్రమ్ నుంచి ఎలాంటి సిగ్నల్స్ అందలేదని ఇస్రో అధికారులు తెలిపారు. వీటి మధ్య కమ్యూనికేషన్ ఏర్పాటు చేసేలా విక్రమ్, ప్రగ్యాన్‌ను స్లీప్ మోడ్ నుంచి వేక్ అప్ చేయడం కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని ఇస్రో అధికారులు ఎక్స్‌లో పోస్ట్ చేశారుల్యాండర్, రోవర్ లు చంద్రుని దక్షిణ ధ్రువంలో 16 రోజుల పాటు స్లీప్ మోడ్ లో ఉన్నాయి. సెప్టెంబర్ 22వ తేదీన అక్కడ పగలు మొదలైంది. ఈ సమయంలో ల్యాండర్ ను, రోవర్ ను రీయాక్టివేట్ చేయాలని ఇస్రో ప్రణాళిక వేసింది. బుధవారం శివశక్తి పాయింట్ వద్ద సూర్యకాంతి రాకతో వాటిని తిరిగి కార్యాచరణలోకి తీసుకురావడానికి ఇస్రో ప్రయత్నాలు చేస్తోంది. చంద్రుని దక్షిణ ధ్రువం చంద్రయాన్–3 దిగిన ప్రాంతంలో సూర్యోదయం జరిగిందని, బ్యాటరీలు రీఛార్జ్ చేయడానికి తాము ఎదురుచూస్తున్నామని ఇస్రో తెలిపింది. విక్రమ్, ప్రజ్ఞాన్‌లతో మళ్లీ కమ్యూనికేషన్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ల్యాండర్, రోవర్ పనిచేయడానికి అవసరమైన వేడిని అందజేసే సూర్యోదయం అవసరమని ఇస్రో తెలిపింది.

# ఫేస్ట్ లిస్ట్‌లో 60 మంది

(మొదటిపేజీ తరువాయి)

నాయకత్వంలో ఈ సమావేశం జరిగింది.స్క్రీనింగ్ కమిటీ సమావేశానికి జిగ్నేష్ మేవాని, బాబా సిద్ధిక్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మాణిక్ రావు ఠాక్రే, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మధుయాష్కీ, భట్టి విక్రమార్క హాజరు అయ్యారు. ఇప్పటికే అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేసిన రాష్ట్ర నాయకత్వం.. ఆ నివేదికను ఢిల్లీ సమావేశానికి తీసుకువచ్చింది. 119 నియోజవర్గాలకు దాదాపు 300 పేర్లను స్క్రీనింగ్ కమిటీకి తెలంగాణ ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ సిఫారసు చేసింది. ఈ క్రమంలోనే అభ్యర్థులను ఖరారు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ లో గతంలోలా పరిస్థితులు లేకుండా సీనియర్ నేతలందర్నీ లైన్లో పెడుతున్నారు. ఎన్నికలకు సంబంధించి కమిటీల్లో ప్రాధాన్యం దక్కడం లేదని ఫీలవుతున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మధుయాష్కీలకు తాజాగా? స్క్రీనింగ్ కమిటీలో చోటు కల్పించారు.. ఇటీవల వారిద్దరూ? అసంతృప్తిగా ఉంటున్నారు. వెంటనే.. పరిస్థితిని చక్కదిద్దేందుకు స్క్రీనింగ్ కమిటీలో చోటు కల్పించారు. మరో వైపు బుస్సు యాత్రకు కాంగ్రెస్ హైకమాండ్ ప్లాన్ చేసింది. పార్టీ ముఖ్య నేతలతో ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి చేపట్టాలని ప్రాథమికంగా తీర్మానించిన నేతలు.. తేదీలను త్వరలో ఖరారు చేయనున్నారు. ఈ బస్సు యాత్రలో సీనియర్లు అందరూ పాల్గొనే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా ఉందని.. స్థిరమైన పాలన అందిస్తామని ప్రజలకు నమ్మకం కలిగేలా ఈ యాత్ర ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ లో అసంతృప్త స్వరాలు తగ్గిపోయాయి. పెద్దగా పార్టీకి ఎవరూ వ్యతిరేకంగా మాట్లాడటం లేదు.రేవంత్ రెడ్డి పూర్తిగా డామినేట్ చేస్తున్నారన్న విమర్శలు, అలకలు ఉన్నప్పటికీ? .ఆయనకు పూర్తిగా చార్జ్ ఇవ్వలేదని? హైకమాండ్ ఆలోచనతోనే అన్నీ జరుగుతున్నాయన్న అభిప్రాయాన్ని కల్పిస్తున్నారు. ఇలాంటి సమయంలో పార్టీకి ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే ఊరుకునేది లేదన్న సంకేతాలు కూడా గట్టిగా పంపడంతో.. కాంగ్రెస్ లో పరిస్థితి లైన్ లోకి వచ్చిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అలాగే ఎల్బీ నగర్ నియోజకవర్గం నుండి ఎన్నికల బరిలో దిగేందుకు మధుయాష్కి గౌడ్ దరఖాస్తు చేసుకోవడంతో కాంగ్రెస్ పార్టీలో ముసలం మొదలైంది.ఇక్కడి నుండి పోటీ చేసేందుకు పార్టీ సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డిలు సంవత్సరాలుగా తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. టీపీసీసీ పిలుపు మేరకు అన్ని కార్యక్రమాలు చేపడుగూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ వస్తున్నారు. ఇలాంటి తరుణంలో మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ తాను స్థానికుడినే అంటూ ఎల్బీ నగర్ నుండి పోటీ చేసేందుకు ముందుకు రావడంతో సెగ్మెంట్ కాంగ్రెస్ నాయకులలో ఆందోళన మొదలైంది.

**ఢిల్లీ బాట పట్టిన ఆశావహులు**

అనేక మంది నేతలు సొంత జిల్లాల నుంచి ఢిల్లీకి వెళ్లి వారిని కలుస్తున్నారు. అంతే కాకుండా ఆ నాయకుల ప్రధాన అనుచరులు, వారినే నమ్ముకున్న నేతలు కూడా హస్తినకు వెళ్లారు. ప్రతి పార్లమెంటు పరిధిలో రెండు సీట్లు బీసీలకు ఇవ్వాలని పార్టీ నిర్ణయించిన నేపథ్యంలో ఎక్కువ మంది హస్తినకు చేరుకున్నారు. దాదాపు 35 నుంచి 40 సీట్లకు ఒకే పేరు పంపించినట్టు తెలిసింది. మిగతా నియోజకవర్గాల నుంచి కొన్ని చోట్ల రెండు పేర్లు, మరికొన్ని చోట్ల మూడుపేర్లు పంపించినట్టు పార్టీ నేతలు అంటున్నారు. ఒక్కటే పేరు ఉన్న నియోజకవర్గాల్లో ఎలాంటి సమస్య లేకపోయినా, రెండు, మూడు పేర్లు ఉన్న చోట ఏ ఒక్కరికి ఇచ్చినా మరొకరి నుంచి సమస్య ఎదురయ్యే అవకాశం ఉన్నట్టు పార్టీ భావిస్తున్నది. జాబితా దఫాదఫాలుగా ప్రకటించకుండా మొత్తం సీట్లను రెండు జాబితాలుగా ప్రకటించే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. ప్రస్తుత రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే సొంత రాష్ట్రమైన మహారాష్ట్రకు వెళ్లి?ఠాక్రే ఎవరు చెప్పితే వింటారో కూడా విచారిస్తున్నట్టు సమాచారం. అక్కడి నుంచి చెప్పించే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. అంతకు ముందు రాష్ట్ర ఇంచార్జిలుగా వ్యవహరించిన ద్విగిజరుసింగ్, రామచంద్రకుంతియా, మాణిక్యం ఠాగూర్‌లను కొంత మంది నేతలు ప్రసన్నం చేసుకుంటున్నట్టు తెలిసింది. స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్ మురళీధరన్ సొంత రాష్ట్రమైన కేరళ కూడా వెళ్లి పైరవీలు చేస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ మాత్రం సమర్థత, ప్రజల్లో పలుకుబడి, వారు చేస్తున్న కార్యక్రమాలు బేరీజు వేసి టికెట్ ఇవ్వాలని నిర్ణయించింది. కొత్తగా పార్టీలో చేరిన వారికి కొన్ని చోట్ల ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలని భావిస్తోంది. సహాయ,సహకారాలను అందించేటట్టు ఆదేశించింది. కొంత మందికి పార్టీ అధికారంలోకి రాగానే ఏదో ఒక పదవి ఇస్తామని ఒప్పిస్తున్నది. ఈసారి పైరవీలకు తావులేదంటూ అధిష్టానం చెబుతున్నా?నాయకులు వారి మాటలను పెడచెవిన పెట్టి ఢిల్లీకి వెళ్లారని అంటున్నారు. పైరవీలకు టిక్కెట్లు రాలవని గెలిచే వారికే టిక్కెట్లు ఇస్తామని హైకమాండ్ చెబుతోంది.

# అభివృద్ధికి ఊతం

(మొదటిపేజీ తరువాయి)

ధర్మసాగర్ చెరువు వద్ద మురుగు నీటి శుద్ధీకరణ (1.0 ఓఒఆ – ఄఖ ) ప్లాంట్, రూ. 3 కోట్లతో ధర్మసాగర్ –మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి ఄ రూ. 1. 50 కోట్లతో బండ్ వైడెనింగ్ (కట్ట విస్తరణ). రూ. 2 కోట్లతో ఇబ్రహీం చెరువు బండ్ వైడనింగ్ (కట్ట విస్తరణ), రూ. 2. 50 కోట్లతో పాత ఎమ్మార్వో కార్యాలయం వెనుక పార్కు అభివృద్ధి, ఇతర చెరువుల అభివృద్ధి, బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం, ప్రధాన కూడళ్ళ అభివృద్ధి, సైక్లింగ్ ట్రాక్, సామాజిక భవనాలు, స్మశాన వాటికలు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామని అన్నారు. టెండర్లు పూర్తి కాగానే పనులను వేగంగా చేయించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు.నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్, కౌన్సిలర్లు, అధికారులు సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.

# అక్టోబరు 10న బీసీ గర్జన

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో గతంలో ఎప్పుడూ లేనంత పాజిటివ్ వైబ్స్ కనిపిస్తున్నాయి. ప్రతీ సారి ఎన్నికలు అంటే సీనియర్లంతా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ ఉంటారు. తమ వర్గానికే టిక్కెట్లు ఇప్పించుకోవాలని ప్రయత్నిస్తూంటారు. ఈ సారి కూడా అలాంటివి ఉన్నా బయటకు రానివ్వడం లేదు. అంతర్గతంగా పూర్తి చేసేసుకుంటున్నారు. అదే సమయంలో వ్యూహాత్మకంగా ప్రచార కార్యక్రమాలు ఖరారు చేసుకుంటున్నారు. భారీ బహిరంగసభలు నెలకు రెండు, మూడు వారాలకు ఒకటి ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ఇటీవలే తుక్కుగూడ బహిరంగసభను భారీగా నిర్వహించిన నేతలు వచ్చే నెల పదో తేదీన బీసీ గర్జన నిర్వహించాలని నిర్ణయించారు. కాంగ్రెస్ బీసీ గర్జనకు ముహూర్తం ఖరారైంది. హైదరాబాద్ నగర శివార్లలో షాద్‌నగర్ వద్ద ఈ సభను నిర్వహించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య హాజరయ్యే అవకాశం ఉంది. కర్ణాటకలో దళిత, బహుజన, ఓబీసీ వర్గాల్లో గట్టి పట్టున్న నేతగా పేరొందిన సిద్ధరామయ్యను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం ద్వారా కర్ణాటక తరహాలో వెనుకబడిన వర్గాల ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంలో కాంగ్రెస్ ఉన్నట్టుగా కనిపిస్తోంది. బీసీ గర్జన ద్వారా తెలంగాణలోని బీసీ వర్గాల్లో నూతనోత్సాహం వస్తుందని .. మహిళా రిజర్వేషన్ల బిల్లులో వెనుకబడిన వర్గాలకు కూడా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ డిమాండ్ డిమాండ్ చేస్తోంది. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉండే 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2–3 నియోజకవర్గాలను బీసీలకు కేటాయించాలని నిర్ణయించారు. మొత్తంగా రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల పరిధిలో 34 మంది బీసీ అభ్యర్థులను బరిలోకి దింపాలని భావిస్తోంది. ఇప్పటికే బలమైన బీసీ అభ్యర్థుల జాబితాను ఫైనల్ చేసుకున్నారు. కొన్ని చోట్ల పోటీ ఎక్కువగా ఉండటంతో బుజ్జగింపులు చేస్తున్నారు. బీసీలకు అత్యధిక సీట్లు ఇవ్వడం ద్వారా ఈ సారి బీసీ ఓటు బ్యాంక్ ను గణనీయంగా తమ వైపు తిప్పుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఈ నిర్ణయం మధుయాష్కీ లాంటి నేతలకు కలిసి వస్తోంది. బలమైన నేత కావడంతో ఆయనకు ఎల్బీనగర్ టిక్కెట్ ఖరారయిందన్న ప్రచారం జరుగుతోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను స్క్రీనింగ్ కమిటీ దాదాపుగా పూర్తి చేసింది. సర్వేలు, గెలుపు అవకాశాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు తెలుస్తోంది. సామాజిక సమీకరణలు, ఆర్థిక, రాజకీయ అంశాల ఆధారంగా అభ్యర్థులను వడపోసినట్లు సమాచారం. తొలి జాబితాను సిద్ధం చేసిన అనంతరం స్క్రీనింగ్ కమిటీ ఆ లిస్టును అధిష్ఠానానికి చేరవేయనుంది. ఈ నెలాఖరు లేదా అక్టోబరు తొలివారంలో మొదటి జాబితాను ప్రకటించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం 119 స్థానాలకుగానూ 70కి పైగా స్థానాల్లో ఇప్పటికే స్పష్టత వచ్చినట్లు సమాచారం. బీసీ గర్జన సభలోపే తొలి జాబితాను ప్రకటించే అవకాశం ఉంది.

## నార్సింగిలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ పై కేసు నమోదు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

నార్సింగ్ భూవివాదంలో ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి లపై నార్సింగి పోలీస్ ఠాణాలో కేసు నమోదయింది. గోల్డ్ ఫిష్ అడోబ్ ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు పై పోలీసులు కేసు నమోదు చేసారు. అడోబ్ సంస్థ స్థలం లోకి అక్రమంగా చొరబడ్డారంటూ ఫిర్యాదు లో వుంది. కోకాపేటలో రెండున్నర ఎకరాల స్థల వివాదంలో కేసులు నమోదు అయింది. 60 మందితో వచ్చి తమ స్థలంలో దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. వీరిద్దరితోపాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. కోకాపేటలోని సర్వే నంబరు 85లో 2 ఎకరాల 30 గుంటల భూమిపై పెట్టుబడిదారులు, డెవలపర్ మధ్య వివాదం నెలకొంది. దీన్ని పరిష్కరించుకోకుండా డెవలపర్ నిర్మించిన తాత్కాలిక గుడిసెల్లో నివాసముంటున్న కూలీలను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో పాటు వారి అనుచరులు ఖాళీ చేయించారని డెవలపర్ ప్రతినిధి గుండు శ్రవణ్ ఫిర్యాదు చేయగా అదేరోజు పోలీసులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు.

## మైనంపల్లి రాజీనామా

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కొంతకాలంగా బీఆర్ఎస్ లో రెబల్‌గా మారిన మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. బీఆర్ఎస్ పార్టీలో ఉంటారా? పార్టీని వీడతారా? అని కొంత కాలంగా ఊగిసలాటలు నడిచిన సంగతి తెలిసిందే. కనీసం ఆయన అనుచరుల్లో కూడా క్లారిటీ లేకుండా ఉంది. తాజాగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.బీఆర్ఎస్ పార్టీలో తనకు రెండు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని మైనంపల్లి హనుమంతరావు కోరిన సంగతి తెలిసిందే. తన సిట్టింగ్ స్థానం మల్కాజ్ గిరి సహా, తన కుమారుడు మైనంపల్లి రోహిత్ కోసం మెదక్ స్థానం ఇవ్వాలని కోరారు. అందుకు అధిష్ఠానం ఒప్పుకోలేదు. కొద్ది వారాల క్రితం విడుదల చేసిన తొలి విడత బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో కేవలం మైనంపల్లి హనుమంతరావుకు మాత్రమే టికెట్ ఇచ్చినట్లుగా పేర్కొన్నారు. నిజానికి అంతకుముందే మైనంపల్లి రెబల్ గా మారినప్పటికీ, అభ్యర్థుల ప్రకటనలో ఆయన పేరును తొలగించలేదు.తర్వాత తనకు పార్టీ కన్నా తన కుమారుడి రాజకీయ భవిష్యత్తే ముఖ్యమని మైనంపల్లి చాలా సందర్భాల్లో చెప్పారు. తాను కేసీఆర్, కేటీఆర్ చివరికి ఆ దేవుణ్ని కూడా లెక్క చేయబోనని అన్నట్లుగా ఆడియో టేప్‌లు కూడా వైరల్ అయ్యాయి. తనకు రెండు టికెట్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ ను మాత్రం ఆయన వదల్లేదు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీలో ఎదురుతిరిగి.. అసలు ఆయన పార్టీలో ఉంటారా? లేక కాంగ్రెస్ లో చేరతారా అనే సందేహాలు వ్యక్తం అయ్యాయి. మరోవైపు, మైనంపల్లి పైన బీఆర్ఎస్ అధిష్ఠానం కూడా ఎలాంటి క్రమ శిక్షణ చర్యలు తీసుకోలేదు.మైనంపల్లి అడుగులు ఎటు వైపు వేస్తారో అని చాలా మంది ఆసక్తిగా ఎదురు చూశారు. తన భవిష్యత్ కార్యాచరణను ఆయన ఇప్పటిదాకా ప్రకటించలేదు.

## హస్తం గూటికే వేముల వీరేశం

**నల్గొండ- ప్రభాత సూర్యుడు:** రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ రేపిన ఉమ్మడి నల్లగొండ జిల్లా, నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాలు ఓ కొలిక్కి వచ్చాయి. బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం చేరికకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ప్రస్తుతం టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కాంగ్రెస్ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ సభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. పార్టీ కండువా కప్పుకునేందుకు హైదరాబాద్ నుంచి ఢిల్లీ బయలు దేరి వెళ్లారు.వాస్తవానికి హైదరాబాద్ లో ఈ నెల 16, 17వ తేదీల్లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల సందర్భంగానే వేముల వీరేశం పార్టీలో చేరాల్సి ఉండింది.

### తండా భూ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే
## మంచిరెడ్డి కిషన్ రెడ్డికి వినతి పత్రం అందజేత
**- మాజీ సర్పంచ్ రాజునాయక్**



ఇబ్రహీంపట్నం – ప్రభాత సూర్యుడు : యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామ రెవిన్యూ పరిధిలోని పట్టా భూములు ధరణిలో అసైన్డ్ ల్యాండ్స్ గా చూపిస్తుండడంతో ఆందోళన చెందిన తండా వాసులు ఇట్టి సమస్యలను నందివనపర్తి మాజీ సర్పంచ్ వర్త్యావత్ రాజు నాయక్ ద్వారా స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకువచారు. భూమి సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీపై తండా వాసులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్య క్రమంలో తాండవాసులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### మెడికల్ ఎంబిబిఎస్ సీటు పొందిన
## పిడుగు సింధుకు అభినందనల వెల్లువ

- మెడికల్ ఎంబిబిఎస్ సీటు పొందిన పిడుగు సింధుకు అభినందనల వెల్లువ
- ఇబ్రహీంపట్నం మండల్ బి ఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి, కర్ణంగూడ మాజీ ఉపసర్పంచ్ పండల దేవేందర్ గౌడ్ ,
- బి ఆర్ఎస్వి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం కోశాధికారి కొత్తపల్లి సాయిగౌడ్ గుండ్ల పవన్ గౌడ్




మంచాల – ప్రభాత సూర్యుడు : ఆరుట్ల గ్రామానికి చెందిన పిడుగు సత్యనారాయణ కూతురు పిడుగు సింధు 10వ తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత మార్కులు సంపాదించింది మరి ఇప్పుడు దేశ వ్యాప్తంగా నిర్వహించిన మెడికల్ (ఎంబీబీఎస్) పోటీ పరీక్ష నీట్ లో, సీటు సంపాదించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు, వారి కుటుంబ సభ్యులను కలిసి కళాశాల ఫీజు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నందున వారికి మా తరఫున 20,000/ ఇరవై వేల రూపాయలు చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు . తల్లిదండ్రులకు గ్రామానికి పాఠశాలకు మండలానికి మంచి పేరు తెచ్చినందుకు సింధుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతటి వంశీ గౌడ్, సుంకరి నిఖిల్ గౌడ్ రావుల బాలరాజ్, జస్వంత్, విష్ణువర్ధన్, భాను, సన్నీ మరియు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ ఘాతంతో వ్యక్తి మృతి



ఇబ్రహీంపట్నం – ప్రభాత సూర్యుడు : కాలినడకన వెళుతున్న వ్యక్తికి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఇబ్రహీంపట్నం పోలీసులు, స్థానిక ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపల్లి రాజశేఖర్ తండ్రి యాదయ్య వయస్సు 30 శనివారం 11 గంటలకు దండు మైలారం పొలిమేరలో కాలినడకన వెళు తుండగా మార్గమధ్యంలో తూము బాయి మర్రి వద్ద కు చేరుకోగానే దండుమైలారం గ్రామ శివారులో పంచర్ షాప్ వద్ద ప్రమాదవశాత్తు రోడ్ సైడ్ ట్రాన్స్ఫార్మర్ ఎర్త్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావ నూతన గడ్డి శేఖర్ కు ఫోన్లో సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇబ్రహీంపట్నం పోలీసులు ఉదయాన్నే పంచనామ నిర్వహించి పోస్ట్ మార్టం నిమిత్తం ఆస్పత్రి తరలించినట్టు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఎస్సై మారేయ తెలిపారు.

### ట్రిప్పర్ మట్టి అన్ లోడ్ చేస్తుండగా
## కరెంటు వైర్లు తగిలి వ్యక్తి మృతి



ఇబ్రహీంపట్నం – ప్రభాత సూర్యుడు : ఉప్పరిగూడ వ్యవసాయ పొలంలో టిప్పర్ తో మట్టి పని చేస్తుండగా పొరపాటున టిప్పర్ హైడ్రాలిక్ పైన ఉన్న కరెంటు తీగలకు తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే చింతపల్లి మండలం గడియ గౌరారం గ్రామానికి చెందిన అందుగుల అబ్బయ్య తండ్రి బాలయ్య వయస్సు 35 భార్య పది సంవత్సరాల క్రితమే మరణించింది. ఇతనికి ఇద్దరు కుమారులు జీవనాధారం కోసం ట్రిప్పర్ క్లీనర్ గా పనిచేస్తున్నాడు. గత 15 నెలల నుండి మాదాపురానికి చెందిన బత్తుల వీరాస్వామి వద్ద టిప్పర్ క్లీనర్ గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామానికి చెందిన అన్నుల చంద్రారెడ్డి వ్యవసాయ పొలంలోకి ట్రిప్పర్ తో మట్టి ఆన్ లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రిప్పర్ హైడ్రాలిక్ ను పైకిలేపగా పైన ఉన్న కరెంటు తీగలకు తాకి పక్కనున్న ట్రక రాడు తీయడంతో విద్యుత్తు ప్రసారం అయ్యి స్పృ హ కోల్పోవడం జరిగింది. ఇది గమనించి వెంటనే ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు మరణించాడు. కేసు నమోదు చేసుకొని ఇబ్రహీంపట్నం పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సి ఐ రామకృష్ణ తెలిపారు.

# గణేశ్ నిమజ్జనానికి పటిష్టమైన బందోబస్తు

- జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్
- గణేష్ శోభాయాత్ర వెళ్ళే మార్గాల్లో సి.సి కెమెరాల ఏర్పాట్లు



జగిత్యాల –ప్రభాతసూర్యుడు: గణేశ్ నిమర్జనమునకు పకడ్బందీ చర్యలను చేపట్టామని, అందరూ ప్రశాంత నిమర్జనమునకు ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ కోరారు. జగిత్యాల పట్టణంలో గణేష్ శోభాయాత్ర వెళ్ళే మార్గంలు ఆయన టవర్ సర్కిల్, లడ్డూ కాజా, తీన్ ఖని, నిమర్జనం జరిగే చింతకుంట చెరువు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు వారి యొక్క సూచనలకు అనుగుణముగా నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు నడుచుకొని ప్రశాంతముగా నిమర్జనం పూర్తి అయ్యేలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. నిమర్జనం అంతయు ప్రశాంత వాతావరణం లో పూర్తి అయ్యేలా భద్రత పరమైన అన్ని చర్యలను చేపట్టామని, అవసరమైన ప్రాంతాలలో సిసి కెమెరాలను, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామని, స్థానిక గజ ఈతగాళ్లను నిమర్జన ప్రాంతములో అందుబాటులో ఉంచమని, శోభాయాత్ర వెళ్ళేమార్గంలో ఇతర శాఖ ల యొక్క సమన్వయము తో ఎటువంటి అవాంతరములు తలెత్తకుండా పట ిష్టమైన చర్యలను తీసుకు ంటున్నామని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా డీజే లు, సౌండ్ సిస్టంలు, బాణాసంచా కాల్చడం వంటివి చేయరాదని తెలిపారు. ముఖ్యంగా యువకులు నిమజ్జనం సమయంలో సంయమనం పాటించాలని ఊర్లలోని పెద్దలు పిల్లలకు తెలియజేసి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, చట్టానికి లోబడి నడుచుకోవాలని తెలిపారు. చట్టానికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. వినాయక నిమజ్జను శాంతియుతంగా, సామ రస్యంగా జరుపుకోవాలని అందుకు ప్రజలు పూర్తిగా పోలీసు వారికి సహకారం అందించాలని కోరారు. జిల్లా ఎస్పీ వెంట డిఎస్పి వెంకటస్వామి, మున్సిపల్ కమిషనర్ అనిల్ బాబు, డీఈ రాజేశ్వర్, ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్బి ఇన్స్పెక్టర్ నాగేశ్వర రావు, ట్రాఫిక్ ఎస్.ఐ రామచంద్రనీ, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# జగన్ రాక్షసానందం

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు : ప్రతిపక్ష నేత చంద్రబాబును జైల్లో పెట్టి ఏపీ సీఎం జగన్ రాక్షసానందం పొందుతున్నారని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మండిపడ్డారు. హైదరాబాద్లో ఎన్టీఆర్ ఘాట్లో నివాళులు అర్పించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్ తీరుపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. . "జైలులో చంద్రబాబుకు ఏదైనా జరిగితే జగన్దే బాధ్యత. జగన్ను నమ్మి ఏపీ ప్రజలు పూర్తిగా మోసపోయారు. చంద్రబాబు లాంటి నేతలను తీసుకెళ్లి జైలులో పెట్టి రాక్షసానందం పొందుతున్నారు. వైఎస్ కూడా ఇలా ఎప్పుడూ పరిపాలన చేయలేదు. ప్రజల కోసం ఐదేళ్లలో బడ్జెట్లో రూ.7–8 లక్షల కోట్లు ఖర్చు చేసిన పెద్ద మనిషి చంద్రబాబు. అలాంటి వ్యక్తి ముష్టి రూ.300 కోట్లకు ఆశపడతారా?" అని ఏపీ మోత్కుపల్లి ప్రశ్నించారు. 2018 ఎన్నికల సమయంలో ఇదే ఘాట్ నుంచి నేను మాట్లాడుతూ జగన్ గెలవాలని ప్రచారం చేశానన్నారు. తన పిలుపుతో దళిత వర్గాలు, పేద వర్గాలన్నీ ఏకమై జగన్ ను గెలిపించాయన్నారు. అధికారంలోకి వచ్చిన తెల్లారే జగన్ మైకంలోకి వెళ్లాడు. ఆ మైకం ఎంత వరకు వెళ్లిందంటే... తల్లిని ఇంటి నుంచి బయటకు పంపించాడు. జైల్లో ఉన్నప్పుడు ఆయన కోసం వేల కిలోమీటర్లు నడిచిన చెల్లెలు షర్మిలను మెడబట్టి బయటకు గెంటాడు. ఆయన పాలన ఎలా ఉందంటే... రాజధాని లేని రాజ్యాన్ని నడిపిస్తున్నాడు. జగన్ పాలించే రాష్ట్రంలో రాజధానే లేదు. 151 సీట్లు ప్రజలిస్తే అది అహంకారంలోకి వెళ్లింది. ఒక్క ఛాన్స్ ఇస్తే బాగా పాలిస్తాడని ప్రజలు నమ్మారు. కానీ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా జగన్ పాలిస్తున్నాడు. మాట్లాడిన వాడినల్లా కొట్టి, తిట్టి, భయపెట్టి నియంత మాదిరి జగన్ రాజ్యమేలుతున్నాడని మోత్కుపల్లి మండిపడ్డారు. 74 సంవత్సరాల పెద్దమనిషి, ఈ దేశానికే నాయకుడు, వాజ్ పేయి ప్రభుత్వానికి సలహాదారుడిగా ఉన్న చంద్రబాబును జైల్లో పెట్టి రాక్షసానందం పొందుతున్నావా? నువ్వొక దుర్మార్గుడివి. 2021లో కేసు బుక్ అయింది. కేసులో ఉన్న వారంతా బెయిల్ పై ఉన్నారు. ఇప్పుడు చంద్రబాబును ఏ ఆధారాలు లేకుండా అరెస్ట్ చేయడం ఏమిటి? చంద్రబాబు వంటి పెద్ద మనిషిని అరెస్ట్ చేయాలంటే గవర్నర్ పర్మిషన్ తీసుకోవాలి. ఏపీలో టీడీపీ హయాంలో రూ. 7 – 8 లక్షల కోట్ల బడ్జెట్ చంద్రబాబు చేతుల మీదుగా ప్రజలకు వెళ్లింది. అలాంటి పెద్ద మనిషి ముష్టి రూ. 371 కోట్లకు దిగజారుతాడా? మాట్లాడేందుకు నీకు సిగ్గు, బుద్ధి ఉందా? మూడు సార్లు ముఖ్యమంత్రి, ఎన్నడూ ఏ ఆరోపణ కూడా రుజువు కాలేనటువంటి పెద్దమనిషి చంద్రబాబు. ఆయన ఏనాడూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు. వ్యక్తులే లేకుండా చేయాలనుకుంటున్నావా జగన్? ఈ నాలుగేళ్లు ఏం పీకావని నేను అడుగుతున్నా. ఎన్నికలు రేపు అనగా.. ఈరోజు చంద్రబాబును అరెస్ట్ చేయడంలో నీ ఉద్దేశం ఏమిటి? చంద్రబాబు వయసుకు విలువిచ్చి నీవు వెంటనే ఆయనకు క్షమాపణ చెప్పు" అంటూ జగన్ పై మోత్కుపల్లి ఫైర్ అయ్యారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీలో కీలకంగా ఉన్న మోత్కుపల్లి ఆ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత చంద్రబాబుపై విమర్శలు చేశారు. గత ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీకి పని చేశారు .

## డిమాండ్లు తీర్చే వరకు సమ్మె కొనసాగిస్తాం
**- సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి**




అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు : మున్సిపాలిటీలో ఔట్సోర్సింగ్ లో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి డిమాండ్ చేశారు. గత 8 రోజులుగా నిరవధిక, శాంతియుత సమ్మె కొనసాగిస్తున్న ఔట్సోర్సింగ్ మున్సిపల్ ఉద్యోగులు 9వ రోజు శనివారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా కొనసాగించారు. మున్సిపల్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తీర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట సంజీవిని
**-ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

**- 2.06 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత**

రంగారెడ్డి – ప్రభాత సూర్యుడు : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల వరం అని, ఆపదలో సంజీవినిలా పనిచేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. యాచారం మండలం మేడిపల్లి, నక్కర్త గ్రామాలకు చెందిన ఏ.యాదయ్య 60,000 రూపాయలు, ఎన్.నరసమ్మకు 32,000 రూపాయలు, ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామానికి చెందిన కే. లాలయ్యకు 32,000 రూపాయలు, బీ.కిష్టమ్మకు 30,000 రూపాయలు, ఎస్.శేఖర్ కు 24,000 రూపాయలు, ఏ. మంజులకు 16,000 రూపాయలు, ఎం.డి. సలామ్ బేగం 12,000 రూపాయలు మొత్తంగా 2,06,000 రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక పేదల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ పాలన కొనసాగుతుందని తెలిపారు.



### ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎంఎస్పీ
## కోఇన్చార్జి సిద్ధపురం శ్రీకాంత్ మాదిగ



ఇబ్రహీంపట్నం – ప్రభాత సూర్యుడు : అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలయిన ఒక్క గ్రూప్–1 నోటిఫికేషన్ ఇచ్చి సమర్థవంతంగా నిర్వ హించడం చేతగాక ఏకంగా 2 సార్లు నిర్వహించి విఫలమైన కేసీఆర్ వెంటనే ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులకు 2లక్షల నష్టపరిహారం అందచేయాలి టీఎస్ పి ఎస్సీ ఛైర్మెన్ తో సహా బోర్డును ప్రక్షాళన చేసి వెంటనే రద్దు చేయాలి రాసిన వారికంటే అదనంగా వచ్చిన అభ్యర్థుల ఓఎం ఆర్ షీట్లను గుర్తించి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి తప్పును ఒప్పుకొని వెంటనే నిరుద్యోగులకు అండగా నిలవాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వాని దేనని డిమాండ్ చేశారు.

### గణేష్ మండపాలను దర్శించుకున్న
## కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి



హయత్ నగర్ – ప్రభాత సూర్యుడు : గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని హయత్ నగర్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన పలు మండపాలను కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు. ప్రజల జీవితాల్లో అవిఘ్నాను తొలగి సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండప నిర్వాహకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

### నోరు జారిన బెల్లంపల్లి
## ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

మంచిర్యాల– ప్రభాత సూర్యుడు : బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నోరు జారారు. బెల్లంపల్లిలో జరిగిన సభలో రైతులు ఆకలితో చావద్దని ఆత్మహత్యలతో చావాలని పిలుపునివ్వడం అక్కడున్న వారిని విస్మయానికి గురిచేసింది. ఈ నేపథ్యంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రసంగం చర్చనీయాంశంగా మారింది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215